


వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు.

ఘనంగా విశేష పూజలు



విశాఖ: కనకమహాలక్ష్మి అమ్మవారికి మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా అమ్మవారికి బుధవారం విశేష పూజలు నిర్వహించారు.



పోటెత్తిన భక్తులు

పెందుర్తిలో వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి ఉదయం నుంచే బారులు తీరారు.

అధినేత దెబ్బ.. అయ్యన్న అబ్బా..

- కుమారుడికి అనకాపల్లి ఎంపీ టికెట్ హుళక్కే..
- నర్సీపట్నానికే పరిమితమంటున్న బాబు
- ఈ సీటు కొడుక్కే ఇవ్వాలంటూ ఇంటి పోరు
- ఇప్పుడు బరిలోకి దింపకపోతే రాజకీయ వారసత్వం కష్టమేనని భావన
- ఇంటి పోరుతో ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో అయ్యన్న
- అధినేత తీరుపై అసహనంతో రగిలిపోతున్న వైనం





సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఒకవైపు అధినేత అనకాపల్లి ఎంపీ సీటు విషయంలో కొట్టిన దెబ్బకు కోలుకోలేక మధనపడుతున్న అయ్యన్నకు.. ఇంటి పోరు మరింత తలపోటుగా మారుతున్నట్టు తెలుస్తోంది. రాజకీయ వారసత్వంగా కొడుకును నర్సీపట్నం నుంచి 2024 ఎన్నికల్లో బరిలోకి దించాలంటూ ఒత్తిడి అధికం కావడంతో ఎటూ తేల్చుకోలేని పరిస్థితి ఎదురైంది. ఈ నేపథ్యంలో ఒకవేళ రానున్న ఎన్నికల్లో కొడుకును బరిలోకి దించకపోతే తన రాజకీయ వారసత్వం కష్టమనే భావనలో అయ్యన్న ఉన్నట్టు తెలుస్తోంది. ఇదే జరిగితే ఇక అయ్యన్న నోటికి తాళం పడినట్టేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వాస్తవానికి కుమారుడికి అనకాపల్లి ఎంపీ సీటు కోసం అయ్యన్న తీవ్రంగా కష్టపడ్డారు. నోటికి వచ్చినట్టు ఇష్టారీతిన అధికార వైఎస్సార్ సీపీపై విమర్శలు గుప్పించారు. అధినేత దృష్టిలో ఉంటూ అనకాపల్లి ఎంపీ సీటును కొడుకుకు వచ్చేలా యతి్నంచారు. అయితే, ఎన్నికలు వచ్చేనరికి వ్యాపారవేత్తలు, పైసలు ఉన్నవారికే సీటు ఇచ్చే అలవాటున్న చంద్రబాబు ఈసారి మారారనే భావనలో అయ్యన్న ఉన్నారు. తీరా ఎన్నికల ముంగిటకు వచ్చేసరికి యథావిధిగా అనకాపల్లి ఎంపీ సీటును బాగా ఖర్చు చేయగలిగిన వ్యక్తికి ఇవ్వనున్నట్టు సంకేతాలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే రాజకీయ వారసత్వం కోసం నర్సీపట్నం నుంచి కొడుకును బరిలోకి దించాలంటూ ఇంటి పోరు రోజురోజుకీ ఎక్కువవుతున్నట్టు తెలుస్తోంది.

కొడుకు పోరుతో విలవిల

వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ సీటు ఇవ్వకపోతే కుమారుడిని నర్సీపట్నం నుంచి బరిలోకి దించాలంటూ ఇంటి పోరు అధికమైనట్టు తెలుస్తోంది. అధికారంలో ఉన్న సమయంలో నోటికి వచ్చినట్టు ఇష్టానుసారంగా మాట్లాడిన అయ్యన్న ఓటమి తర్వాతైనా గుణపాఠం నేర్చుకుంటారని అందరూ భావించారు. అయితే, అయ్యన్న బుద్ధి మాత్రం మారలేదు. సరికదా ఓటమి బాధలో మరింతగా దిగజారి మాట్లాడటం ప్రారంభించారు. ఫలితంగా నియోజకవర్గంలో అయ్యన్నకు ఏ మాత్రమూ పట్టుపెరగడం లేదు. మరోవైపు ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ వివాదరహితుడు కావడం... తాజాగా జరిగిన సాధికార యాత్ర విజయవంతం కావడం వల్ల మరోసారి వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో కచ్చితంగా 2024 ఎన్నికల్లోనే కుమారుడిని బరిలోకి నిలిపేలా ఇంటి పోరు ఎక్కువవుతోందని సమాచారం. 2029 ఎన్నికల వరకూ వేచిచూడటం కష్టమంటూ కుమారుడికి మద్దతుగా అయ్యన్న సతీమణి కూడా గొంతు కలుపుతున్నట్టు తెలుస్తోంది. ఫలితంగా అధినేత వైఖరితో తలబొప్పి కట్టిన అయ్యన్నకు... ఇంటి పోరు మరింత తలపోటుగా మారింది. కొడుకును బరిలోకి దింపి రాజకీయ వారసత్వాన్ని కొనసాగించుకుంటారా లేదా అనేది త్వరలో తేలనుంది.

రాజకీయ వారసత్వం కష్టమే..

వాస్తవానికి ఏ రాజకీయ నాయకుడైనా తనకు ఆరోగ్యం, వయస్సు సహకరించిన సమయంలోనే తన వారసత్వాన్ని రాజకీయాల్లో దించటం సహజ పరిణామం. తీరా వయస్సు అయిపోయిన తర్వాత వారసత్వాన్ని రంగంలోకి దించితే గెలిపించడం కష్టంగా మారుతుంది. ఈ నేపథ్యంలోనే అనేక మంది రాజకీయ నాయకులు తమ వారసులను రంగంలోకి దించే ప్రయత్నం చేస్తారు. అయితే అయ్యన్న నర్సీపట్నంతో పాటు అనకాపల్లి ఎంపీ సీటు ఇవ్వాలని కోరుతున్నారు. చంద్రబాబు మాత్రం ఎప్పటికప్పుడు దీనిపై దాటవేస్తూ వస్తున్నారు. కొద్దిరోజుల ముందు భారీగా ఖర్చు చేసే అభ్యర్థి దొరకడంతో అనకాపల్లి ఎంపీ సీటు ఇవ్వలేమని తేల్చిచెప్పేశారు. దీంతో పార్టీ కోసం కష్టపడితే ఇదేనా నాకిచ్చే గౌరవమంటూ ఆయన లోలోపల మండిపడుతున్నట్టు తెలుస్తోంది. అయితే, ఇదే పరిస్థితుల్లో నర్సీపట్నం నుంచి తాను రంగంలోకి దిగితే వచ్చే ఎన్నికల వరకు అంటే 2029 వరకూ రాజకీయ వారసత్వం కోసం వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈసారి ఎన్నికల్లో గెలిచే సూచనలు కనిపించనప్పటికీ కొడుకును బరిలో నిలపడం ద్వారా రాజకీయ వారసత్వం కొనసాగించే అవకాశం ఉంటుంది.

న్యూస్‌రీల్

క్రీడలతో మానసిక ఉల్లాసం

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభిస్తున్న కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

చింతపల్లి రూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించేందుక ఈ పోటీలు దోహద పడతాయన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబర్చి జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రాణించాలని సూచించారు. మండలంలో అన్ని క్రీడలకు సంబంధించి 108 టీమ్‌లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వీరిలో 88 టీమ్‌లు వారిలో మండల స్థాయికి 88 టీములు వచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య మార్కెట్ కమిటీ చైర్మన్ జైతి రాజులమ్మ, మండల అధ్యక్షులు మోరి రవి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సభ్యులు మీరా, కోఆప్షన్ సభ్యులు నాజర్‌వలీ, ఎంపీడీవో ఆశాజ్యోతి, ఎంపీటీసీ జయలక్ష్మి, కార్యదర్శులు, పార్టీ నాయకులు శ్రీరాములు, జోషప్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ సందర్శన



థర్మల్ పవర్ స్టేషన్ వద్ద చింతూరు విద్యార్థులు, అధ్యాపకులు

చింతూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పారిశ్రామిక సందర్శనలో భాగంగా బుధవారం తెలంగాణ రాష్ట్రం పాల్వంచలో కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పవర్ స్టేషన్‌లో బొగ్గు నుంచి విద్యుత్ ఉత్పత్తి జరిగే ప్రక్రియను తెలుసుకున్నారు. అనంతరం సమీపంలోని కిన్నెరసాని జలాశయం, అనకట్టను కూడా వారు సందర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్, అధ్యాపకులు వెంకట్రావు, నాగేశ్వరరావు, పద్మ, అప్పనమ్మ, హారతి, శైలజ, సంగంనాయుడు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు, నిందితుడితో ఎస్‌ఈబీ పోలీసులు

రంపచోడవరం: డివిజన్ కేంద్రమైన రంపచోడవరం అనధికారికంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని ఎస్‌ఈబీ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో విక్రయిస్తున్న మధు అనే వ్యక్తి నుంచి యానాం నుంచి తీసుకువచ్చిన మద్యం సీసాలను స్వాధీనంచేసుకున్నట్టు ఎస్‌ఈబీ సీఐ ఆనంద్ తెలిపారు. నిందితుడిని రంపచోడవరం కోర్టులో హాజరు పరిచినట్టు ఆయన పేర్కొన్నారు. దాడుల్లో ఎస్‌ఈబీ ఎస్‌ఐ ఫణీంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జగదల్‌పూర్ వరకే కిరండూల్ రైళ్లు



తాటిచెట్లపాలెం: కొత్తవలస–కిరండూల్ లైన్ పరిధి దంతేవాడ–కమ్లూర్ సెక్షన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను ఆయా తేదీల్లో గమ్యం కుదించినట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం ఎ.కె త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ గురువారం జగదల్‌పూర్ వరకు మాత్రమే నడుస్తుంది. గురు, శుక్రవారాల్లో కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ జగదల్‌పూర్ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ గురువారం జగదల్‌పూర్ వరకు మాత్రమే నడుస్తుంది. గురు, శుక్రవారాల్లో కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ జగదల్‌పూర్ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

కాఫీ రైతులకు గిట్టుబాటు ధర

- చెల్లిస్తున్న మాక్స్, జీసీసీ సంస్థలు
- దళారులకు చెక్ పెట్టేలా చర్యలు: ఐటీడీఏ పీవో అభిషేక్



జీసీసీ కొనుగోలు చేస్తున్న కాఫీ గింజలు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో కాఫీ పండ్ల మార్కెటింగ్ చివరిదశకు చేరుకుంది. పాడేరు ఐటీడీఏ ఆధీనంలోని చింతపల్లి మాక్స్ సొసైటీ కిలో రూ.43 ధరతో కాఫీ పండ్ల కొనుగోలు చేపట్టింది. రెండు వేల టన్నుల కొనుగోలు లక్ష్యం కాగా ఇప్పటివరకు 836 టన్నులు సేకరించింది. మిగిలిన లక్ష్యాన్ని ఫిబ్రవరి నెలాఖరుకు పూర్తి చేసేలా ఐటీడీఏ, కాఫీ విభాగం అధికారులు కృషి చేస్తున్నారు.

జీసీసీ ఆధ్వర్యంలో..

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జీసీసీ ఈ ఏడాది కూడా కాఫీ గింజల కొనుగోళ్లను చేపట్టింది. పాచ్ మెంట్ గింజలు కిలో రూ.280, గుళ్ల రకాన్ని రూ.145 ధరతో ప్రారంభించింది. కొనుగోలు లక్ష్యం 1500 టన్నులు కాగా ఇప్పటివరకు 150 టన్నుల కొనుగోలు చేసింది. ఈ సందర్భంగా పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ పాడేరు డివిజన్ పరిధిలోని కాఫీ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గిట్టుబాటు ధర కల్పిస్తూ దళారులకు చెక్ పెట్టినట్టు ఆయన పేర్కొన్నారు.



మాక్స్ సంస్థ కొనుగోలు చేసిన కాఫీ పండ్లు

త్వరలోనే అరకు పార్లమెంట్ పరిధిలో పర్యటిస్తాం



పార్టీ విశాఖ ఉత్తర నాయకులతో సమీక్ష చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి

- సమన్వయకర్త నియామకంపై అభిప్రాయాలు సేకరిస్తాం
- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ గెలుపే తమ లక్ష్యమని ఆ పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఎండాడలోని పార్టీ కార్యాలయంలో గాజువాక, విశాఖ ఉత్తర, భీమిలి, పెందుర్తి, అరకు నియోజకవర్గాల పార్టీ ముఖ్య నాయకులతో బుధవారం ఆయన సమావేశయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అరకు సమన్వయకర్త నియామకంపై అక్కడి కార్యకర్తల నుంచి కొన్ని అభిప్రాయాలు వచ్చాయన్నారు. త్వరలోనే అరకు పార్లమెంట్ పరిధిలో పర్యటిస్తామన్నారు. అక్కడ పార్టీ శ్రేణుల అభిప్రాయాలను సేకరించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నివేదిస్తామన్నారు. నివేదిక పరిశీలన అనంతరం పార్టీ అధిష్టానం నిర్ణయం వెలువరిస్తుందని చెప్పారు. ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గొల్ల బాబూరావు, తిప్పల నాగిరెడ్డి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు, గాజువాక ఇన్‌చార్జి ఉరుకూటి చందు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

నియోజకవర్గాల సమీక్ష

భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి ఉరుకూటి చందు, విశాఖ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజుల ఆధ్వర్యంలో నియోజకవర్గాల వారీగా కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో వైవీ సుబ్బారెడ్డి సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు గురించి చర్చించారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కంపా హనోక్, అల్లు శంకరరావు, కార్పొరేటర్లు ముత్తంశెట్టి ప్రియాంక, కంటిపాము కామేశ్వరి, కె.అనిల్‌కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, శ్రీనివాసరావు, పి.ఉషశ్రీ, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, శశికళ, కో–ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, వార్డు ఇన్‌చార్జి నీలి రవి తదితరులు పాల్గొన్నారు.

వీకే పీసీపీఐఆర్‌యూడీఏ చైర్మన్‌గా చొక్కాకుల వెంకటరావు



సీతమ్మధార: విశాఖ–కాకినాడ పెట్రోలియం కెమికల్ ఇన్వెస్టిమెంట్ రీజియన్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా చొక్కాకుల వెంకటరావును నియమించారు. ఈ మేరకు బుధవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. తనకు ఈ అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి ఈ సందర్భంగా చొక్కాకుల వెంకట్రావ్ కృతజ్ఞతలు తెలిపారు.

'లీడ్' చాంపియన్ ధ్రువిక ఆర్యనా



ఆర్యనాకు బహుమతి అందిస్తున్న సుమిత్

బీచ్‌రోడ్డు: ఎడ్‌టెక్ కంపెనీ నిర్వహించిన లీడ్ చాంపియన్‌షిప్ 2023 విజేతగా నగరానికి చెందిన ఎల్. ధ్రువిక ఆర్యనా నిలిచింది. బెంగళూర్‌లో జరిగిన గ్రాండ్ ఫైనల్స్‌లో కమ్యూనికేషన్, క్రిటికల్ థింకింగ్ అంశాలపై నిర్వహించిన పోటీల్లో ఆమె ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ పోటీల్లో దేశ వ్యాప్తంగా 3 వేల మంది విద్యార్థులు పోటీపడగా.. ఆర్యనా విజయం సాధించింది. లీడ్ సంస్థ వ్యవస్థాపకుడు సుమిత్ మెహతా చేతులమీదుగా బహుమతి స్వీకరించింది.

సెలవుల్లో తరగతులు నిర్వహించవద్దు

విశాఖ విద్య: సంక్రాంతి సెలవుల్లో పాఠశాలలు, కాలేజీల్లో తరగతులను నిర్వహించడానికి వీల్లేదని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు కమిషన్ సభ్యులు డాక్టర్ గొండు సీతారాం బుధవారం ఈ విషయాన్ని వెల్లడించారు. పాఠశాలలు ఈ నెల18 వరకు, జూనియర్ కాలేజీలకు ఈ నెల 17 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినందున విద్యార్థులను విద్యాలయాలకు పిలిపించవద్దన్నారు. నిబంధనలు పాటించని విద్యా సంస్థల యాజమాన్యాలపై చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు.

లైంగిక దాడి చేసి చంపేశారు

- బాలిక అనుమానాస్పద కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్
- ఇద్దరిపై పోక్సో కేసు నమోదు
- రిమాండ్‌కు తరలింపు



కేసుకు సంబంధించిన వివరాలను వివరిస్తున్న అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

చింతపల్లి రూరల్: గూడెంకొత్తవీధి మండలం చెరుకుంపాలెంలో సంచలనమైన బాలిక అనుమానాస్పద కేసును పోలీసులు ఛేదించారు. ఆమెపై లైంగికదాడికి పాల్పడి హతమార్చిన ఇద్దరిని అరెస్టు చేసినట్టు చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. చెరకుంపాలెం గ్రామానికి చెందిన 11 ఏళ్ల బాలిక గత మంగళవారం ఇంటివద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె ఉరివేసుకున్నట్టుగా ఉండటంతో బలవన్మరణానికి పాల్పడిందని భావించిన తల్లిదండ్రులు ఖననం చేశారు. ఆ తరువాత ఆమె మరణానికి కారణాలు ఒక్కొక్కటి వారి చెవిన పడ్డాయి. గ్రామానికి చెందిన పాంగి రమేష్(19) అనే యువకుడు ఆమె బాలిక చేయిపట్టుకుని ఆమె ఇంట్లోకి తీసుకువెళ్లినట్టుగా తెలుసుకున్నారు.తమ కుమార్తెది బలవన్మరణం కాదని హత్య కావొచ్చని భావించిన వారు గూడెంకొత్తవీధి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఖననం చేసిన మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు పోస్టుమార్టం నిర్వహించారు. బాలికపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసినట్టుగా పోస్టుమార్టం రిపోర్టులో వైద్యులు పేర్కొన్నారు. దీంతో ఈదిశగా పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు.

లొంగిపోయిన నిందితులు

బాలిక మృతితో సంబంధం ఉన్న పాంగి రమేష్, అతని స్నేహితుడు గెమ్మిలి సీతన్న వీఆర్వో సమక్షంలో పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిద్దరిని విచారించడంతో పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చాయి. బాలికపై లైంగిక దాడికి పాల్పడిన రమేష్ ఇదంతా బయటకు వస్తుందన్న భయంతో స్నేహితుడు గెమ్మిలి సీతన్న (19)ను ఆశ్రయించాడు. వారిద్దరు కలిసి మరొకసారి ఆమెపై లైంగిక దాడికి పాల్పడి ఆమె గుండెలపై గుద్ది, గొంతు నులిమి చంపేశారని ఏఎస్పీ తెలిపారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు ఉరిపోసుకుని చనిపోయినట్టుగా సీన్ సృష్టించారని ఆయన పేర్కొన్నారు. వారి నుంచి తప్పించుకునేందుకు బాలిక శతవిధాలా ప్రయత్నించినా విడిచిపెట్టలేదన్నారు. నిందితులిద్దరిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఏఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో గూడెంకొత్తవీధి సీఐ అశోక్‌కుమార్, చింతపల్లి సీఐ రమేష్, ఎస్‌ఐలు అప్పలసూరి, అరుణ్‌కిరణ్ పాల్గొన్నారు.

ఆడారి ఆనంద్ పెద్ద మనసు

- దుబాయ్ నుంచి ఇందిరానగర్ వాసి మృతదేహం తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు
- విమాన చార్జీలను భరించిన వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆనంద్‌కుమార్

మల్కాపురం: ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లిన ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. పైగా ఆయన వీసా గడువు ముగిసింది. అక్కడి నుంచి మృతదేహాన్ని ఇక్కడకు తీసుకొచ్చేందుకు అతని కుటుంబ సభ్యులకు తలకుమించిన భారమైంది. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త, విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్ మానవత్వం చూపించారు. అతని మృతదేహం తీసుకొచ్చే ఏర్పాట్లు చేయడంతోపాటు అందుకయ్యే విమాన చార్జీలను భరించారు. జీవీఎంసీ 60వ వార్డు ఇందిరా కాలనీకి చెందిన కొయ్య అప్పలస్వామి ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. ఇటీవల అనారోగ్యంతో అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే అతని పర్మిట్ వీసా గడువు ముగిసింది. దీంతో మృతదేహాన్ని ఇక్కడకు తీసుకురాలేని పరిస్థితి నెలకొంది. అతని కుటుంబ సభ్యులు కార్పొరేటర్ పి.వి.సురేష్, వార్డు అధ్యక్షుడు ఆడారి హరీష్ ద్వారా వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణకు ఈ విషయం చెప్పారు. ఆయన ఢిల్లీలోని ఎంబసీ అధికారులతో మాట్లాడారు. దీంతో అప్పలస్వామి మృతదేహం బుధవారం ఇక్కడకు తీసుకురాగా.. కుటుంబసభ్యులు అంత్యక్రియలు పూర్తి చేశారు. దుబాయ్ నుంచి మృతదేహం తీసుకొచ్చేందుకు అయిన విమాన చార్జీలను కూడా ఆడారి ఆనంద్‌కుమార్ చెల్లించి పెద్ద మనసు చాటుకున్నారు. ఆయనకు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

మహారాణిపేట: జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన గురువారం నిర్వహిస్తున్నారు. ఉదయం పది గంటలకు 10 గంటలకు రెండో స్థాయీ సంఘం, 10.30కు 5, 12కు 4, 6, మధ్యాహ్నం 3 గంటలకు 1, 3, 7వ స్థాయీ సంఘం సమావేశాలు జరుగుతాయి. సమగ్ర ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని జెడ్పీ సీఈవో పోలినాయుడు తెలిపారు.

పారదర్శకంగా కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ

- ఎవరికీ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు
- స్పష్టం చేసిన డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులు క్రమబద్ధీకరణ కోసం ఎవరికీ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు స్పష్టం చేశారు. డబ్బులు తీసుకుంటున్నారనే వార్తలను నమ్మవద్దని, ఈ విషయంపై ఎలాంటి సమాచారం ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఓ ప్రకటనలో కోరారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆదేశాల మేరకు పారదర్శకంగా క్రమబద్ధీకరణ జరుగుతోందని.. ఉద్యోగులు ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దని ఆయన సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్–18, ఫార్మసిస్టులు–14, ఆరోగ్య కార్యకర్తలు(పురుష)–278, మహిళ–19 మంది సర్వీసులను క్రమబద్ధీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎన్నికల్లో సెక్టోరల్ అధికారుల విధులు కీలకం



కూటూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన రంపచోడవరం సబ్‌కలెక్టర్ ప్రశాంత్ కుమార్

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



మాట్లాడుతున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

అరకులోయ రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో సెక్టోరల్ అధికారుల విధులు కీలకమని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాట్లపై దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ఏర్పాట్లపై ముందస్తుగా ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రతీ పోలింగ్ కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు పూర్తిస్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల విధులపై ప్రతిఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. సమస్యాత్మకంగా ఉండే పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఇందుకు సంబంధించిన సమాచారం ఇవ్వాలని కోరారు. ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు చేర్చడం పోలింగ్ అనంతరం తిరిగి స్ట్రాంగ్ రూమ్‌లకు అప్పగించే వరకు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ ఈఈ వేణుగోపాల్, తహసీల్దార్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

కూనవరం: పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు పక్కాగా ఏర్పాటు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రంపచోడవరం సబ్‌కలెక్టర్ ఎస్ ప్రశాంత కుమార్ సూచించారు. మండల పరిధిలోని కూటూరు, పెదార్కూరు, జగ్గవరం, నర్సింగపేట, పోచవరం కాలనీలో బుధవారం పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ప్రాథమిక సౌకర్యాలు కల్పించలేని పోలింగ్ కేంద్రాలు ఉంటే వాటి సమాచారాన్ని తమకు అందజేయాలని తహసీల్దార్ అనుసూయను ఆదేశించారు.